# చేయిజారిన ఉత్తరం

రచన!
సురేస్ కుమార్

త్రనను రాజగోపాలరావు బెదిరించి ఆరువేల రూపాయలు లాక్కొన్నాడని సుందరం వాదించాడు. కాని పంచాయతుదార్లు నమ్మలేదు. ఆ మాట నమ్మడానికి తగిన సాక్ష్యదారులు ఏదీ లేదన్నారు. పైగా రాజగోపాలరావు ఏమని బెదిరించాడో అది స్పష్టంగా చెప్పబడలేదన్నాడు. నిందితుడు 'నేరస్థు'కని ఏకగ్రీవంగా అభిప్రాయపడుతున్నామన్నారు.

మాజిస్ట్రేటు ఒకసారి కళ్ళజోడు తీసి జేబు రుమాలుతో అద్దాలు తుడుచుకొని, తిరిగి ధరించి తీర్పువ్రాయనారంభించాడు.

సుందరం ప్రేక్షకుల బెంచీల ప్రక్కనే నిలబడివున్న ఒక యువతివంక నిస్పృహగా చూశాడు. మరోసారి మాజిస్ట్రేటు వైపు చూశాడు. తదుపరి అతని దృష్టి తన లాయర్ పైకి, ఆ తర్వాత ప్రేక్షకుల బెంచీలకు దగ్గరగా రెండు కుర్చీలపై కూర్చుని వున్న యిద్దరు పెద్దమనుష్యులవంక సుందరం దృష్టి ప్రసరించింది.

ఆ యిద్దరు ఠీవిగా, హుందాగా కూర్చున్నారు. వారు ఎవరై వుంటారు అనుకొన్నాడు.

మాజిస్ట్రేటు గొంతు సవరించుకొని అన్నారు, 'సోమసుందరం! నీ కష్టార్జితవిత్తం ఆరువేల రూపాయలు నిన్ను బెదిరించి రాజగోపాలరావుగారు అపహరించారని ఆ డబ్బు, ఒక ముఖ్యమైన పత్రం స్వాధీనం చేసుకోడానికి ఆయన యిట్లు చొరబడ్డానని అంటున్నావు. నీవాదం సహేతుకమైనదని ఏ కోర్టూ అంగీకరించదు. ఆయనలా డబ్బు పీక్కున్నప్పుడు నువ్వు పోలీసులకు ఫిర్యాదు చేసివుండవలసింది. అలాగాక నువ్వే న్యాయాధికారాన్ని స్వయంగా వహించబోయావు. కొన్నాళ్ళ క్రితం నలుగురు పెద్ద మనుష్యులు-నలుగురు డిటెక్టివులమని చెప్పుకొంటూ కోర్టును ఏమిరించినవారిని, కోర్టు పొరపాటున వదలివేసినవారిని తాము వీక్షించే న్యాయపాలకులమని చెప్పుకొనేవారు వారి ధోరణిలోనే వుందినీ చర్య. కోర్టు న్యాయవిచారణలో పొరపడటమనేది యెక్కడా జరగదు. నువ్వు చేసిన నేరం చాలా తీవ్రమయినది. నువ్వు పట్టుపడినపుడు నీవద్ద రివాల్వరు వుండడం నీ నేరాన్ని మరింత మోపు చేస్తున్నది. నీయా నేరానికి మూడేళ్ల కఠిన ఖైదు విధించాను.'

బోనులో నిలబడి వున్న మద్దాయ సోమసుందరం మరి ఒకసారి ప్రేక్షకుల బెంచీల ప్రక్కనే నిలబడివున్న యువతివంక దీనంగా చూశాడు. ఇద్దరు కానిస్టేబుల్స్ అతణ్ణి తీసుకుపోయారు.

కోర్టునుంచి ముందు బయటికి వచ్చినది యిద్దరు. ఆ యిద్దర్ని గురించే యెవరై వుంటారా అని సోమసుందరం ఆశ్చర్యపడ్డాడు.

ఇద్దరిలో ఒకడు 'ఆ అమ్మాయి బయటికి వచ్చేదాకా వేచివుందాం' అన్నాడు,

'ఆ పిల్ల అతని భార్యే అయివుంటుందో' మరొకతను.

ఆ యువతి బయటికి వచ్చింది. ఆమె వయస్సు 20 ఏళ్ళు మించి వుండదు అపరీకాదు. కాకున్నా అనాకారి కూడా కాదు. సామాన్యంగా లక్షణంగా వున్న ముఖం ఆమెది. కాని ఆ ముఖం విన్నబోయివుంది. కళ్ళు అశ్రోజలంతో నిండి పలకరిస్తే దుఃఖం పొంగి పొరలవచ్చేట్లుంది. ఆమె మార్షల్ రోడ్డు వైపుగా నడవసాగింది.

'అమ్మాయ్!' అని పిలిచాడు రఘుపతి. ఆమె ఆగి వెను తిరిగి చూసింది.

'నిన్నే పిలిచాను. నిన్ను కోర్టులో చూశాను. శిక్ష పడిన మద్దాయినీ కేమౌతాడు?' అన్నాడు చలపతి.

'నా స్నేహితుడు అతడు నన్ను పెళ్ళి చేసుకుంటానన్నాడు. మీరు పత్రికలవారా అంది శారద. అది ఆ యువతి పేరు.

'కాము. మీ స్నేహితునికి స్నేహితులముకూడా కాము. బోనులో నిలబడి అతను చెప్పిన సంగతులు

(తరువాయి 23వ పేజీలో)

(6వ పేజీ తరువాయి)

మాకు నిజమనే తోచాయి. ఏమంటావ్ చలపతి! అన్నాడు రఘుపతి.

'నిజమనే చెప్పగలను. అబద్ధమైతే అతడు కళ్లు చికిలించి వుండేవాడు. అబద్ధమాడేవాళ్ళ లక్షణం అంతే కాదు. మగవాళ్ళు పిడికిలి బిగించుకొని కూర్చుంటే అబద్ధం చెప్పలేరు. ఆడవాళ్ళు అల్లా కూర్చోకుండా అబద్ధమాడ లేదు.'

ఈశరీర శాస్త్ర మర్మాలు చలపతినోట వెలువడుతూ వుంటే శారద ఆశ్చర్యంగా విన్నది.

మీ స్నేహితుణ్ని మేము విడిపిస్తాము. మాకు అన్ని సంగతులు పూర్తిగా చెప్పగలవా?' అన్నాడు రఘుపతి.

'రోడ్డుమీద నడుస్తూ ఏం చెప్పను? దయవుంచి మీరు మా యింటికి వస్తే చెబుతాను. మా యిల్లు యిక్కడే పుదుప్పేట పోలీసు లైన్స్ ప్రక్కనే వుంది.' అంది శారద.

రఘుపతి, చలపతి ఆమెతోకూడా ఆమె యింటికి వెళ్ళారు. ముందు గదిలో కూర్చున్నారు. ఆమె లోపలికి వెళ్ళి అయిదు నిమిషాలలో రెండు గ్లాసులతో కాఫీ తెచ్చి వారి ముందుంచింది.

ఇద్దరూ కాఫీ త్రాగి, సిగరెట్లు ముట్టించారు.

ఆమె ఇలా చెప్పింది.—

'మీకు మా సుందరంపట్ల నా పట్ల ఎందుకు యింత దయగలిగిందో నాకు బోధపడకుండా వుంది కాని మిమ్మల్ని చూస్తే - ఎందుకో కొండంత ధైర్యం కలుగుతూ వుంది. నేను సుందరం తరపున వాదించాడానికి నియమించిన ప్లీడరు 'ఇక అప్పీలుచేసి ప్రయోజనం లేదు. డబ్బు దండుగకాని 'అన్నారు' అని ఆగింది శారద.

'అప్పీలు చెయవచ్చు. హైకోర్టుకు అప్పీలు చేద్దాం' అన్నాడు రఘుపతి.

'మీతో వాస్తవం చెబుతున్నాను. నేను ఎగ్మూర్‌లోని హైస్కూల్‌లో చదువుకుంటూ వుండేదాన్ని. నాకు 15 ఏళ్ళవయస్సు. మా తరగతిలోనే యాకూబ్ అనే ముస్లిం యువకుడు వుండేవాడు. అతడు నా కంటికి ఎందుకో నచ్చాడు. అతడు మంచి హుషారుగా వుండేవాడు. నన్ను చూసి ముసిముసి నవ్వులు నవ్వుతూ వుండేవాడు. ఫిఫ్త్ ఫారం చదువుతున్నపుడు ప్రారంభమైన గొడవ యిది. అతడు నేనంటే ఎంతో మక్కువ చూపేవాడు. నాకు అతనంటే ఎంతో అనురాగంగా వుండేది. ఇద్దరూ స్కూల్ ఫైనల్‌లోకి వెళ్లాం. అతనికి మామధ్య చనువు హెచ్చసాగింది. అతనికి ప్రేమలేఖలు వ్రాస్తూ వుండేదాన్ని. అతడుకూడా అప్పుడప్పుడు నాకు జవాబిస్తూ వుండేవాడు.

'స్కూల్ ఫైనల్ ప్యాసైనాక అతడు ఆ తర్వాత ఏమైనాడో కనిపించలేదు. నేను షైప్ షార్టు హ్యాండు నేర్చుకున్నాను. ఒక కంపెనీలో ఉద్యోగానికి చేరాను. ఆ కంపెనీలోనే సుందరం మేనేజరుగా పని చేస్తున్నాడు. అతను నన్ను ప్రేమించాడు. తాను గత పదిసంవత్సరాలలోను కష్టపడి, ఆరువేలరూపాయలు సంపాదించుకున్నానని చెప్పాడు. తన పెళ్ళికి తన మేనమామ వాలుగువేల రూపాయలు ఉచితంగా యిస్తాడనికూడా వెల్లడించాడు.

10 వ తేదీని పెళ్ళికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాం. శుభలేఖలు అచ్చు వేయించాం. నా బంధుమిత్రులకు, అతని బంధుమిత్రులకు పంపాం. ఎనిమిదో తదీ ఉదయం నాకు పోస్టులో ఒక ఉత్తరం వచ్చింది.

318 డి బ్రాడ్వేలో వున్న తన ఆఫీసుకు అతి జరూరుగా ఒకసారి వచ్చి కలుసుకోవలసిందని వుంది ఆ లేఖలో.

'సుందరం ఆఫీసుకు వెళ్ళిపోయాడు. అతణ్ణి తీసుకునే అక్కడకు వెడదామా అనుకున్నాను. కాని, పోనీ ఏమిటో సంగతి చూద్దాం' అనుకుని నేనే స్వయంగా ఒక్కర్తిని వెళ్ళాను. అక్కడ ఈ దుర్మార్గుడు రాజగోపాల్ కనిపించాడు. నేను ఆ ముస్లిం యువకునకు వ్రాసిన ఒక ప్రేమలేఖ ఫొటోగ్రాఫ్ చేసిన కాపీని చూపించాడు.'

'ఎంత డబ్బిస్తే, ఆ లేఖ తిరిగి యిస్తానన్నాడు?' అని అడిగాడు చలపతి.

'ఆరువేలూను. సుందరం కష్టార్జితవిత్తం మొత్తం

తనకిచ్చివేయాలన్నాడు. లేకపోతే మా బంధువులకు, మిత్రులకు, సుందరం మేనమామకు ఆ ఉత్తరం ఫొటో తీసిన ప్రతులు పంపిస్తానన్నాడు.

'నాకేమీ పాలుపోలేదు. ఈసంగతి సుందరానికిచెప్పి, పెళ్ళి రద్దు చేసుకొనడమే మార్గాంతరమనుకున్నాను. ఆ సాయంత్రం సుందరం మా యింటికిరాగానే జరిగినదంతా చెప్పివేశాను. అతడు అంతా విన్నాడు. రాజగోపాల్‌ను కలుసుకున్నాడు. అతనితో గొడవ జరిగింది. ఇద్దరు కొట్టుకొన్నారు. రాజగోపాల్ సుందరాన్ని మెడ పట్టుకుని బయటకు గెంటివేశాడట. ఆ మరునాడు మళ్ళీ వెళ్ళి కలుసుకున్నాడు. ఆరువేలు తనదగ్గరవున్న డబ్బు అంతాయిచ్చి ఆ ఉత్తరం తీసుకోడానికే నిర్ణయించుకున్నాడు. ఏమైనా నన్ను పెళ్ళిచేసుకొని తీరుతానన్నాడు.'

'రాజగోపాల్ దగ్గరకువెళ్ళి ఆరువేలరూపాయలు యిస్తానన్నాడు. ఆ ఉత్తరం వెనకాల వైపు తెల్లకాగితం మీద ఆరువేలరూపాయలు తనకు ముట్టినట్లు రాసియివ్వాలని షరతు పెట్టాడు. దానికి అతను ఒప్పుకుని షెనాయ్ నగర్‌లోవున్న తన బంగలాకు రాత్రి 9 గంటలకువచ్చి, డబ్బిచ్చి, ఉత్తరం తీసుకుపొమ్మన్నాడు. సుందరం రాజగోపాల్ యింటికి వెళ్ళాడు, డబ్బు ఆరువేలూ యిచ్చాడు. రాజగోపాల్ ఉత్తరం చూపించాడు. దానిలోని తెల్లకాగితంమీద రసీదువ్రాసి, అణాబిళ్ళలు అంటించి సంతకం చేశాడు. ఒక కవరులో అదిపెట్టి, అంటించి యిచ్చాడు. సుందరం సరాసరిగా మాయింటికివచ్చి, ఆ కవరు నాకిచ్చాడు. నేను చించిచూసి, అందులో ఉత్తరం లేదు, రసీదు లేదు. తెల్లకాగితం మాత్రమే వుంది.'

'బలే! హస్తలాఘవంలో కూడా రాజగోపాల్ ఘనుడన్నమాట. అతడు కొంతకాలం ఆర్మీలో పని చేశాడు. అది నాకు తెలుసు.' ఆ తర్వాతన్నాడు చలపతి.

'ఆ తర్వాత సుందరం నాతో చెప్పాడు. తాను ఈసారి రాజగోపాల్‌కు గట్టిగా బుద్ధిచెప్ప దలచుకున్నానని, నలుగురు డిటెక్టివులని ఎవరో వున్నారట. వాళ్ళపద్ధతిలోనే తాను స్వయంగా చర్య తీసుకుంటానన్నాడు. పోలీసులదాకావెళ్ళి ఈ సంగతి బట్టబయలు చెయ్యడం తనకిష్టంలేదన్నాడు. ఆ ఇంట్లో ఆడవాళ్ళు లేరట. ఒక నౌకరుమాత్రమే వున్నాడట. ఒకసారి అక్కడకువెళ్ళి, ఆ మేడ అనుపాను చూసివచ్చాడు. సుందరం దగ్గర రివాల్వర్ వుంది. అది ఎక్కడిదో చెప్పాడుకాడు. వెళ్ళాడు. ఆ రాజగోపాల్ గదిలో ప్రవేశించాడు. రివాల్వర్‌తో భయపెట్టి, ఉత్తరం డబ్బు లాక్కోవాలని చూశాడు, కాని పట్టుబడిపోయాడు. ఇది జరిగినసంగతి. మీరు సాయం చెయ్యదలచుకుంటే చెయ్యండి,' అంది శారద.

'చాలా తప్పుపని చేశాడు. రోజూ అతను పగటిపూట బ్రాడ్వేలోని ఆఫీసులోనే వుంటాడు. కనక అటువంటి ఉత్తరం ఏ బ్యాంకులోనో సేఫ్ డిపాజిట్ లాకర్‌లో వుంచడం సహజం. బెదిరించి డబ్బు లాగడమే వృత్తిగా కలవారికి మానవ స్వభావం పూర్తిగా తెలుసు. ఏమైనా కాని ఆ ఉత్తరం వారంరోజులలోపుగా నీ చేతిలో పెడతాను. సరేనా. నువ్వు నిశ్చింతగా వుండు,' అని చెప్పి, ఆ యిద్దరు పెద్దమనుష్యులూ వెళ్ళిపోయారు.

(సశేషం.)

పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
Diamond Jubilee
1898 1958
ఆయుర్వేదాశ్రమం (ప్రైవేట్) లిమిటెడ్,
మదరాసు-17.

# చేయిజారిన ఉత్తరం

రచన!
"సురేన్ కుమార్"

(గత సంచిక తరువాయి)

రాజగోపాలరావు కోర్టునుంచి ఇంటికి వెళ్ళాడే కాని అతని మనస్సు ఎందుకో అశాంతిగానే వుంది. నిందితునకు శిక్ష పడిందన్న సంతృప్తి, సంతోషం అతనికి అంతగా కలగలేదు. స్వభావతః ధైర్యస్థుడే అయినా కోర్టులో వున్నంతసేపు వాడో అనిశ్చిత పరిస్థితి ఎదుర్కొంటున్నట్లుగానే అతనికి తట్టింది.

ఏమైతేనేం - తెగువతో వ్యవహరిస్తున్నాడు. మనిషికి హృదయం, జాలి, దయ, దాక్షిణ్యం వుంటే డబ్బు సంపాదించలేడని అతని మతం. ఇంతవరకూ అలాగుండల్లేకుండా, పశ్చాత్తాపం, చింత అనేది లేకుండా వర్తిచే కొన్ని వేలరూపాలు సంపాదించుకొన్నాడు,

కోర్టునుంచి ఇంటికి రాగానే నౌకరును పిలిచాడు సోడా తెమ్మన్నాడు. సోడా తెచ్చి నౌకరు అక్కడ పెట్టి వెళ్ళిపోయాడు. అలమార్ నుంచి విస్కీసీసా తీశాడు. సోడాలో కలుపుకొని త్రాగి, సిగరెట్ అంటించాడు. ఈజీచైరులో కూర్చుని కోర్టులో జరిగినదంతా మననం చేసుకోసాగాడు. కోర్టులో వుండగా ఏదో ఒక వింతైన విచిత్రానుభూతి కలిగినట్లయింది. అది జడ్జిని చూసినందువల్లకాదు. ముద్దాయి న్యాయవాది చేసిన క్రాస్ ఎగ్జామినేషన్ వల్లా కలగలేదు,

'ఆరే రామూ!' అని పిలిచాడు రాజగోపాలరావు నౌకరు వచ్చాడు.

కోర్టులో నువ్వు ప్రేలిన పేలాపనకు అర్థం ఏమిటి? 'రామూరామూ రారా!' అని నిన్ను పిలిచానా? నీసహాయం కోరానా? సుందరంలాంటి చవటల్ని పాతికమందిని తన్నగల్ను. ఏమిటి ఆ చవట సాక్ష్యం?'

'అలా చెబితే మనకి మరింత బలంగా వుంటుందని చెప్పానండీ?'

'ఏడిచావు కోర్టులో మనం ఎరుగున్నవాళ్ళు ఎవరైనా కనిపించారా? నేనంటే కోపంవున్నవాళ్లు?'

'కనిపించలేదండి. ఎవరైనావున్నా మనతో ఉజ్జీ కారు.'

'మనం మనం అంటున్నావేమిటి? సరే. కాని ఈ రాత్రి నువ్వు వంటగది గుమ్మంలో పడుకో ఎవరైనా దొంగ మేడలో ప్రవేశించాలంటే అది ఒక్కటేదారి కనక అక్కడ నువ్వు కాపలావుండు.'

'దొంగ జైలుకు వెళ్లాడుగదా! ఇక మనకు భయం ఏంది బాబయ్యా?'

'ఈ తునకి జబ్బు నీకు బాగా పట్టుకుంది. నేను చెప్పినట్లు చెయ్యి.' అని కసిరాడు రాజగోపాలరావు.

ఆ రాత్రికాని మరునాడుగాని ఏ కొత్త సంఘటన జరగలేదు.

మూడవనాటి మధ్యాహ్నం ఒంటిగంటకు రాజగోపాలరావు బ్రాడ్వేలోని తనఆఫీసులో కూర్చునివుండగా గుమాస్తావచ్చి - 'మీకోసం ఎవరో వచ్చారు' అన్నాడు.

ఆ వచ్చినవ్యక్తి ఆఫీసుగది వెలుపలవున్న బెంచుమీద కూర్చున్నాడు, తలుపుకు ప్లాస్టిక్ అక్షరాల బోర్డువుంది

'ఏ. వి. రాజగోపాలరావు - ఫైనాన్షియర్' అని.

'ఎవరు స్త్రీలా, పురుషులా?' అన్నాడు రాజగోపాలరావు.

'పురుషులే.'

'రమ్మను.'

ఆ వ్యక్తి లోపలకి రాగానే-'కూర్చోండి' అన్నాడు. కూర్చుని - 'మీతో అయిదునిమిషాలు ప్రయివేటుగా మాట్లాడాలి' అన్నాడతను,

'చెప్పండి. ఇక్కడ మనం మాట్లాడుకొనేది. బయటకు వినిపించదు' అన్నాడు రాజగోపాలరావు.

'నావిషయంకాదు. మాతమ్ముడు కమలాకరరావు విషయం : జనవాణీ బ్యాంకి కాషియర్ గా వుంటున్నాడు. ఈమధ్య మా కెవరికి తెలియకుండా రహస్యంగా రేసులకు వెడుతున్నట్టు తెలిసింది. బ్యాంకిడబ్బు వాడేశాడు. ఇవాళ ఆఫీసుకు వెళ్లలేదు, ఇంటికీ రాలేదు. బహుశా ఆత్మహత్యకు గాను పాల్పడ్డాడేమో అని భయపడుతున్నాను. ఇవాళ మధ్యాహ్నంవెళ్ళి బ్యాంకి ఏజంటుతో మాట్లాడదామనుకొంటున్నాను,' అన్నాడా వ్యక్తి.

'ఏమాత్రం దుర్వినియోగం చేశాడు?'

'కనీసం మూడులక్షల రూపాయలు వాడుకొని వుంటాడు. అవి నెగోషియబుల్ సెక్యూరిటీలు - ఎక్కడైనా మార్చుకోవచ్చు. ఈసంగతి అతని భార్యద్వారా నాకు తెలిసింది, బ్యాంకి అధికారులకు ఇంకా తెలియదనుకొంటాను. వాళ్ళు ఈరోజు తనిఖీ చేసుకోరుగదా. 'మీరు బ్యాంకి క్లయింటులలో ముఖ్యులు కనక శాస్త్రులూ తమ్ముడి తరఫున మాట్లాడండి. మీ మేలు మరిచిపోను.' అన్నాడా వ్యక్తి.

'నేనా? మరి బాగుంది.' అన్నాడు రాజగోపాలరావు ఒక్కక్షణం యోచించాడు. పర్సులోవి రెండువంద రూపాయలనోట్లు తీశాడు.

'ఇదిగో! ఈ రెండువందలు తీసుకొని మీరు యింటికి పోండి, బ్యాంకికి వెళ్ళవద్దు. వాళ్లు ఈ సంగతి బయట పడ్డప్పుడు ఏం చేస్తారో చూద్దాం' అన్నాడు.

రెండువందలూ తీసుకొని అతడు వెళ్ళిపోగానే రాజగోపాలరావు తన కారులో బ్యాంకివెళ్ళాడు. ఏజంటును కలుసుకున్నాడు.

'నేను అతి జరూరుగా లండన్ వెళుతున్నాను. ఏడెనిమిది నెలలకుగాని రాను. కొన్ని యంత్రాలకు ఆర్డరిచ్చి రావాలి. ఇక్కడ ఒక షుగర్ ఫ్యాక్టరీ నిర్మాణానికి ఏర్పాటు చేస్తున్నాను.' అని చెక్కు యిచ్చాడు.

పదివేలు వుంచి 80 వేలరూపాయలు తీసుకొన్నాడు! సేఫ్ డిపాజిట్ లాకర్‌లో దాచినపెట్టె తీసుకొన్నాడు. కారులో ఇంటికి వచ్చాడు.

ఆ రాత్రి తన ప్రక్క పడకగదిలోనే వెయ్యమన్నాడు. నౌకరు రామూ ఆశ్చర్యపోయి 'ఏంబాబూ!' అన్నాడు.

'అనిష్టుపిడే! చెప్పినట్లు చెయ్యి.' అని కేకవేశాడు రాజగోపాలరావు.

♦ ♦ ♦

రాత్రి ఒంటిగంటకు వీధిలో గణగణలాడుతూ వెళ్ళిన శబ్దంవిని, నిద్రనుంచి మేల్కొన్న రాజగోపాలరావు 'ఎవరియిళ్లో పరశురామప్రీతి అయినాయి' అనుకొన్నాడు.

మరో పదినిమిషాలకే హాలులో నౌకరు రామూ ఎవరితోనో ఘర్షణపడుతున్న సవ్వడివిని తలుపుతీశాడు.

'ప్రక్కనున్న గ్లాస్ ఫ్యాక్టరీ స్టోర్స్ అంటుకుంది. ఫైర్ ఇంజను తీసుకువచ్చాము. మీఇంటిలోనుంచి హోస్ పెట్టాలి అంటే గింజుకొంటున్నాడేమిటి?' అన్నాడు ఫైర్ బ్రిగేడ్ ఆఫీసర్.

"మీరు ఒకసారి నాగదిలోకి రండి" అని ఆహ్వానించాడు రాజగోపాలరావు ఆ ఆఫీసర్ని. తన ఇంటిలోంచి హోస్ ప్రయోగించేబదులు ఆ ఆపాకర్యం మరోయింటివానికే కల్పిస్తే తనకు ఏపీడా వుండదుగదా అనుకొన్నాడు.

ఆఫీసరు లోపలకురాగానే-తలుపు చేరవేసి-ఇనప్పెట్టిలోంచి డబ్బుతీసి ఇదిగో! పాతికరూపాయలిస్తాను. ఈ హోసుగీసు యిక్కడ పెట్టవద్దు. మరోయింటిలో పెట్టించండి" అన్నాడు రాజగోపాలరావు.

"అంతేనా!" అన్నాడు ఆ ఆఫీసరు. ఇనప్పెట్టి తలుపు తెరిచేవుంది.

పాతికరూపాయలు ఆఫీసరు తీసుకొన్నాడు. రాజగోపాలరావు ఇనప్పెట్టితలుపు వేయబోతూవుండగా 'ఆగు!' అన్నాడు ఆఫీసర్.

రాజగోపాలరావు తిరిగిచూశాడు.

ఆఫీసర్ చేతిలో రివాల్వరు వుంది.

ఈకక్కటోపి-నల్లటి కళ్లద్దాలు-మఫ్లరు ధరించిన ఆ ఆఫీసర్ ముఖం గుర్తించడానికి వీల్లేకుండావుంది.

"చేతులు పైకెత్తి వెనక్కు వెళ్లు. నాటకం ఆడావా తల ప్రేలిపోతుంది తెలుసా!' అని గర్జించాడు ఆ ఆఫీసరు.

"ఎవరు నువ్వు?" అన్నాడు రాజగోపాలరావు.

"నలుగురు డిటెక్టివుల్లో ఒకణ్ణి తెలుసా? కదిలేవా కపాలమోక్షం తప్పదు. కబర్దార్" అన్నాడు.

తెల్లవారింది. బాగా ప్రొద్దెక్కింది రాజగోపాలరావు ఇంకా మంచంమీద పడుకొనేవున్నాడు.

నౌకరు రామూ వచ్చాడు.

"బాబయ్యా! పోలీసులు" అన్నాడు.

అంతలోనే ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలనాయుడు సార్జెంట్ విలియమ్స్ లోపలికి వచ్చారు.

"మిస్టర్ రాజగోపాలరావు! నిన్ను అరెస్టుచేస్తున్నాను. సుందరాన్ని బెదిరించి డబ్బులాగి, అతనిపైన కేసుపెట్టి జైలుకు అక్రమంగా పంపించిన నేరానికి నిన్ను శిక్షించడానికి కావలసినంత సాక్ష్యం వుంది." అన్నాడు ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ నాయుడు.

"మీ మీద ఎవరు రిపోర్ట్‌చేశారు ? ఎవరు దుశ్చర్యత వెల్లడించారు?" అని అడిగాడు సార్జెంట్ విలియమ్స్.

రాజగోపాలరావు మాట్లాడలేదు. రఘుపతి మాటలు ఇంకా గింగురుమని చెవిలో మార్మ్రోగుతున్నాయి.

"నిన్ను చంపాలనుకొంటే-బ్యాంకి కాషియర్ అన్నగారినంటూ నాదగ్గరకు వచ్చిన మీచలపతే నిన్ను చంపి వుండేవాడు. నువ్వు నలుగురు డిటెక్టివుల్ని గురించి ఏమైనా పోలీసులతో అన్నావో నువ్వు ఒక ఆర్మీని కాపలాపెట్టుకొని జైల్లో కూర్చునివున్నా చంపుతా జాగ్రత" అనే రఘుపతి హెచ్చరించి, ఇనప్పెట్టెలోని కాగద వుత్తరం లాక్కుపోతూ అన్నాడు.

అన్నంతపని వారు చేస్తారని తెలుసు. కనకనే రాజగోపాలరావు పోలీసుస్టేషన్‌లోగాని, మాజిస్ట్రేట్ కోర్టులోగాని ఏమీ అనలేదు. మౌనముద్రే ధరించాడు. జైలుకు వెళ్లాడు.

(సమాప్తం)

---


# 'కథాంజలి'

[చక్కని కథల మాసపత్రిక]

స్థాపితం. 1938.

| | | |
|---|---|---|
| విడిప్రతి | — | 25 న. పై. |
| సంవత్సర చందా | | 4-0-0. |

(ప్రత్యేక సంచికలతో సహా.)

అన్ని హెగిన్ బాథమ్స్ బుక్‌స్టాలులోనూ దొరకును.


## చిత్రసమీక్ష

విజయావారు తెలుగులోను, తమిళంలోను కూడా నిర్మించిన సమగ్రహాస్త చిత్రం 'అప్పుచేసి పప్పుకూడు' మద్రాసులోని పత్రికా ప్రతినిధులకు ప్రత్యేకంగా ప్రదర్శించబడింది.

రావుబహదూర్ రామదాసు (సి. యస్. ఆర్.) జమీందారు ముకుందరావు మనమరాల్ని కోడలుగా చేసుకోవాలనే కోరికతో ఎత్తులువేస్తాడు, తన కుమారునికి చిన్నతనంలోనే పెళ్ళిజరిగినా, ఆ పిల్ల చనిపోయిందనే వాద వేస్తాడు. చివరకు ఆమె మాటలురాని మూగ దానిపిల్లలా యింట్లో వుండడానికి అంగీకరిస్తాడు.

రాజా (ఎన్. టి. రామారావు) జమీందారుగారి మనుమరాలు మంజరిని (సావిత్రి) ప్రేమించి వున్నందున - తాను మహారాజావలె నటిస్తువుంటాడు. ముకుందరావు (శ్రీ ఎస్. వి. రంగారావు) మేనేజరు భజగోవిందం తన బావ రామలింగం కుమార్తెను ప్రేమిస్తాడు. రామదాసుకొడుకు రఘు (శ్రీ జగ్గయ్య) తాను చిన్నవాడు పెళ్ళిచేసుకున్న భార్యను గుర్తించి ఆమెను ఏలుకొంటాడు. భజగోవిందం (శ్రీ రేలంగి) తన మామ కుమార్తెనే పెళ్ళిచేసుకొంటాడు.

ముగ్గురు - యువకులు - ముగ్గురు యువతులు ప్రేమగాథ ఫలించి. చివరకు రామదాసు తప్పును నిరూపించి పరాభవించడంతో ముగుస్తుంది కథ.

పూర్తి హాస్యచిత్రాలులేని కరువును తీర్చిన చక్కని హాస్యరస ప్రధానమైన ఈ చిత్రాన్ని నిర్మించినది శ్రీ నాగిరెడ్డి, శ్రీ చక్రపాణి. దర్శకుడు శ్రీ ఎల్.వి. ప్రసాద్.

శ్రీ ఎన్. టి. రామారావు, ఎస్. వి. రంగారావు, జగ్గయ్య, సి. యస్. ఆర్., రేలంగి. రమణారెడ్డి. శివరావు, సావిత్రి, జమున, గిరిజ, నల్ల రామమూర్తి, కుటుంబరావు, నరసింహమూర్తి, రామలింగయ్య, బాలకృష్ణ, పద్మనాభం, ప్రసాదరావు, మిక్కిలినేని-యింతమంది ఈ చిత్రంలో నటించారు, అందరు అత్యుత్తమంగా నటించారు.

— అనూరి